నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 5 నవంబర్ 2024 | HANUMAKONDA

# వడ్లు కొనుడు వద్దా?

- రైతుల ఓట్లు మాత్రం కావాలా..
- 15 రోజుల నుంచి ఒక్క గింజా సేకరించలేదు
- మద్దతు ధర, బోనస్ ఇవ్వడంలో విఫలం
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్(కమలాపూర్), నవంబర్4: గత15 రోజుల నుంచి ఒక్క గింజా కొనలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఓట్లు కావాలే తప్ప వడ్లు కొనుడు వద్దా అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం కమలాపూర్ మార్కెట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. వడ్ల కొనుగోలు, మద్దతు ధర, బోనస్ ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతుల పంటలు మిల్లులకు చేరకముందే సంచులు పంపించి, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు చేసి ధాన్యాన్ని సేకరించిందని గుర్తు చేశారు. కల్లాల్లోని ధాన్యాన్ని కోతులు, పందికొక్కులు నాశనం చేస్తున్నాయని, రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఒక్క రోజు కూడా వడ్ల కొనుగోలుపై రివ్యూ పెట్టారా అని ప్రశ్నించారు. అలాగే పత్తికి మద్దతు ధర కూడా అందడం లేదని, రూ. 7521కు కొనుగోలు చేయాల్సిన పత్తిని రైతులు కేవలం రూ. 5వేలకే అమ్ముకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతులకు రైతుబంధు అందించారని, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపినప్పటికీ రైతుబంధు ఆపలేదని గుర్తు చేశారు. పదేళ్ల కాలంలో 11సార్లు రైతులకు రూ. 72,815 కోట్లను రైతుబంధు ద్వారా రైతులకు అందించి ఘనత కేసీఆర్‌ది అన్నారు. రైతులకు గన్నీ సంచులు, టార్పాలిన్ల వంటి చిన్న సహాయం కూడా చేసే తెలివి రేవంత్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. వెంటనే వడ్లను కొనుగోలు చేసి రూ. 500 బోనస్ ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కళ్యాణిలక్ష్మణ్, నవీన్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్, మెండు రమేశ్, మాట్ల వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



- మొదటి నుంచీ దూరంగా ఉంటున్న దొంతి
- తాజాగా అదే దారిలో వెళ్తున్న నాయిని
- పార్టీలో కొత్త వాళ్లకు పెత్తనంపై నారాజ్
- మంత్రి జోక్యంపై ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం

ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య దూరం క్రమంగా పెరుగుతున్నది. ప్రభుత్వ పనులకు నిధుల కేటాయింపు, సొంత నియోజకవర్గంలో ఇతరుల జోక్యం, పార్టీలో కొత్త వాళ్ల పెత్తనంపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మంది గుంభనంగా ఉంటున్నా సీఎంపై ఇద్దరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే నిరసన తెలిపారు. ముఖ్యమంత్రిని నేరుగా కలిసే ప్రయత్నం చేయకపోగా, జిల్లా పర్యటనకు వచ్చినా వెళ్లి కలవడం లేదు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మొదటి నుంచీ రేవంత్‌రెడ్డికి దూరంగా ఉంటుండగా, ఇప్పుడు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అదే దారిలో వెళ్తున్నారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం హనుమకొండకు రాగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నాయిని ఆయనను కలుసుకోలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో వీరిద్దరూ సీఎంకు దూరంగా ఉంటున్నారని వారి అనుచరులు చెప్పడం గమనార్హం.

- వరంగల్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# ఒక్కొక్కరుగా..

## సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యేల అసంతృప్తి

ఉమ్మడి జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో మంత్రి కొండా సురేఖ జోక్యంపై ఆయా ఎమ్మెల్యేలు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. ఆయన కలవకపోవడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై పార్టీ, ప్రభుత్వ పరంగా ఎలాంటి తదుపరి చర్యలు లేవు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలువురు అధికార పార్టీ నాయకులకు నామినేటెడ్ పోస్టుల ప్రతిపాదనలను ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకోలేదని తేలింది. అభివృద్ధి పనుల విషయంలోనూ ఇదే జరిగిందని సమాచారం. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉంటున్న తమను కాకుండా అసెంబ్లీ ఎన్నికలకు వారం ముందు పార్టీలో చేరిన వారికి, ఓ కేసులో తనతో ఉన్న నాయకుడికి సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని నాయిని అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం సీఎం పర్యటనకు దూరంగా ఉన్నట్లు తెలిసింది.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సీఎం పర్యటనలకు మొదటి నుంచి దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పదవుల కేటాయింపులో పార్టీలో సీనియర్లకు అన్యాయం జరిగిందని ఆయన అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, కొత్తగా వచ్చిన వారికి కీలక పదవులు ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయనను కలవలేదని దొంతి సన్నిహితులు చెబుతున్నారు. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనకు రాగా మాధవరెడ్డి పాల్గొనలేదు. ఆ తర్వాత అధిక వానలతో నష్టం జరిగిన మహబూబాబాద్ జిల్లాలో సీఎం పర్యటించారు. వానల కారణంగా హెలికాప్టర్ ప్రయాణం వీలు కాకపోవడంతో మహబూబాబాద్, నర్సంపేట, వరంగల్ మీదుగా రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లారు. నర్సంపేటలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముందు నుంచే సీఎం హైదరాబాద్‌కు వెళ్లగా నర్సంపేటలోనే ఉన్న ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆయనకు స్వాగతం పలకలేదు. రాష్ట్ర ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో విధాన నిర్ణయాలపై అసంతృప్తి కారణంగానే మాధవరెడ్డి దూరంగా ఉంటున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే ఇలా ఉంటే, మరో నాలుగేండ్లు గడిచే సరికి ఇంకెంత మంది దూరమవుతారో అని కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది.



బచ్చన్నపేట : ముందస్తు అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లతో పోలీసులు



రాయపర్తి : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

# ఎక్కడికక్కడే కట్టడి

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

- తెల్లవారక ముందే పోలీస్ స్టేషన్లకు తరలింపు
- హైదరాబాద్‌కు తరలకుండా అడ్డగింత
- పోలీసుల తీరుపై మండిపాటు

నమస్తే నెట్‌వర్క్, నవంబర్ 4: పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుత ధర్నా చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మాజీ సర్పంచ్‌లు సోమవారం హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారక ముందే ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ బిల్లుల కోసం తాము చేపట్టనున్న శాంతియుత ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో సీఎం పాలననా లేక పోలీస్ పాలన జరుగుతుందా అనేది అర్థం కావడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి కోసం తాము అప్పులు చేసి పనులు చేశామని, వడ్డీలు కట్టలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా తమ పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



టేకుమట్ల : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు




పాలకుర్తి : పోలీసులు అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

### ప్రజా పాలన అంటే ఇదేనా?

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాజీ సర్పంచ్‌ల అరెస్టుకు ఖండన



దేవరుప్పుల/హనుమకొండ/తొర్రూరు: కేసీఆర్ తెచ్చిన బంగారు తెలంగాణ లో భాగస్వాములై పల్లెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కేంద్రం నుంచి అనేక ఉత్తమ అవార్డులు తెచ్చిపెట్టిన సర్పంచ్‌లను ఈ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి ప్రజాపాలన అంటే ఇదేనని చాటుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పెండింగ్ బిల్లుల కోసం పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపా రు. విధిలేక పోరుబాట పడితే అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, 11 నెలలు గడుస్తున్నా ఉలుకూపలుకూ లేకపోవడంతో మాజీ సర్పంచ్‌లంతా పోరుబాట పట్టారని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఆస్తులు అమ్మి అప్పుల పాలైన మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించాల్సింది పోయి అరెస్టులు చేస్తున్న ఈ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భంగపాటు తప్పదన్నారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవ డంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులను బేషరతుగా విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

# ఎలక్ట్రిక్ బస్సులు వచ్చేశాయ్..

- వరంగల్ రీజియన్‌కు 82 కేటాయింపు
- ప్రస్తుతం వరంగల్-2 డిపోకు చేరిన 34..
- పర్యావరణహితంగా సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు
- త్వరలోనే అందుబాటులోకి..




హనుమకొండ చౌరస్తా, నవంబర్ 29 : వరంగల్ రీజియన్‌కు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చేశాయి.. తొలిసారి కాలుష్య రహిత సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి రానున్నాయి. త్వరలోనే వీటిని రోడ్లపైకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ మార్పులు చేస్తూ ప్రయాణికులను పెంచుకునే పనిలో నిమగ్నమైంది. ఇంధనం ఖర్చు తగ్గించుకుని ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. రీజియన్‌కు 82 బస్సులను కేటాయించగా, ఇందులో సూపర్ లగ్జరీ–18, డీలక్స్–14, సెమీ డీలక్స్–21, ఎక్స్‌ప్రెస్‌లు–29 ఉన్నాయి. వీటిని హైదరాబాద్, నిజామాబాద్, ఏటూరునాగారం, మంగపేట, ఖమ్మం, భూపాలపల్లి రూట్లలో నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం వీటిలో 34 సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు వరంగల్–2 డిపోకు చేరుకోగా, అందులోనే ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ కాంట్రాక్టు పద్ధతిలో ఈ బస్సులను నిర్వహిస్తున్నది. త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సూపర్ లగ్జరీలో 41, డీలక్స్‌లో 45 సీట్లు 2+2 ప్యాటర్న్‌లో, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు 2+3 ప్యాటర్న్‌లో డిజైన్ చేశారు.

**అత్యాధునిక హంగులతో..**

అత్యాధునిక హంగులతో ఈ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం ఫ్రంట్ అండ్ రియర్ ఎయిర్ సస్పెన్షన్, ఒక నెల బ్యాకప్‌తో క్యాబిన్, సెలూన్‌లో ఒక్కొక్కటి చొప్పున అంతర్గత, ఫ్రంట్, రియర్ కెమెరాలు ఉన్నాయి. వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్, పానిక్ బజర్ ప్రొవిజన్, ప్రతి సీటుకు మొబైల్ యూఎస్‌బీ చార్జింగ్ సదుపాయం, అంతర్గత ప్రకటనల కోసం పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, ప్యాసింజర్ డోర్‌తో పాటు రెండు అత్యవసర డోర్ల సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రయాణికుడు డోర్‌లో నిలబడితే అది మూసుకోకుండా యాంటీ పించ్ ఫీచర్ ఉంది. ఈ బస్సుల్లో క్లచ్, గేర్ బాక్స్ ఉండవు. వాహనం కదలిక కోసం డ్రైవ్, న్యూట్రల్, రివర్స్ (డీఎన్ఆర్) బటన్ మాత్రమే ఉంటుంది. ఈ బస్సులను పూర్తి చార్జింగ్ చేస్తే 360 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. సింగిల్ పిన్‌తో రెండున్నర గంటలు, డ్యూయల్ పిన్‌తో ఒకటిన్నర గంటల్లో చార్జింగ్ అవుతుంది. బస్సులు గరిష్ఠంగా గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.

### కాలుష్యరహిత సమాజం కోసం..

కాలుష్యరహిత సమాజం కోసం ఎలక్ట్రిక్ బస్సులు ఎంతో ఉపయోగపడతాయి. ఇప్పటి వరకు 34 బస్సులు వరంగల్–2 డిపోకు చేరుకున్నాయి. త్వరలో మంత్రుల చేత ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో 12 వరకు చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల అవసరాన్ని బట్టి బస్సులు పెంచడం, లేదా తగ్గించడం చేస్తాం. ఎట్టిపరిస్థితుల్లో వరంగల్–2 డిపోను ప్రైవేట్ పరం చేయం. జేబీఎం సంస్థకు కిరాయికి ఇచ్చాం.

– డీ విజయభాను, వరంగల్ రీజినల్ మేనేజర్

# ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయొద్దు

- పాలకుర్తి తహసీల్దార్ శ్రీనివాస్
- శాతాపురం కొనుగోలు కేంద్రం సందర్శన

నమస్తే ఎఫెక్ట్

పాలకుర్తి, నవంబర్ 4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రైవేట్ వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కేసులు తప్పవని జనగామ జిల్లా పాలకుర్తి తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం 'ప్రభుత్వ కేంద్రాల్లో ప్రైవేట్ వ్యాపారులు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఇక్కడి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించొద్దన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ గోనె మైసిరెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, రాకేశ్, సీఈవో రణధీర్, చిన్న యాదయ్య, బానోత్ వెంకట్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్

# వికటించిన వైద్యంపై విచారణ

- ములుగు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆరా
- నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు
- వెల్లడించిన డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : గర్భ విచ్ఛిత్తి కోసం ఆర్ఎంపీ డాక్టర్ అందించిన వైద్యం వికటించడంతో తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఘటనపై ములుగు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ వైద్యాధికారులు ములుగు జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు గర్భ విచ్ఛిత్తి కోసం ప్రయత్నించి అస్వస్థతకు గురైన విషయమై వివరాలు సేకరించి ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావుకు సమాచారం అందించారు. సోమవారం 'వికటించిన వైద్యం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, వెంకటాపూర్, మంగపేట మెడికల్ ఆఫీసర్లు శ్రీకాంత్, గౌతమ్‌ను విచారణాధికారులుగా నియమించారు. కాటాపూర్ గ్రామానికి చెందిన మహిళ తన తల్లిగారి ఊరైన మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు రాము వద్ద వైద్యం పొందిందని నిర్ధారించారు. సోమవారం అతడి క్లినిక్‌ను తనిఖీ చేసేందుకు క్రాంతికుమార్ వెళ్లగా అప్పటికే రాము తాళం వేసి హనుమకొండకు వెళ్లినట్లు తెలిసింది. మంగపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమ్ హనుమకొండలో చికిత్స పొందుతున్న మహిళ వద్దకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. అలాగే వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఓ మెడికల్ షాపులో గర్భ విచ్ఛిత్తి మందులు కొనుగోలు చేసి వినియోగించడంతో అస్వస్థతకు గురై హనుమకొండలో దవాఖానాలో చికిత్స పొందుతుండగా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు డాక్టర్ శ్రీకాంత్ ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రెండు ఘటనలపై విచారణ చేపట్టామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



కాళేశ్వరం : గోదావరి తీరంలో పూజలు చేస్తున్న భక్తులు



కాళేశ్వరంలో లక్ష వత్తులు వెలిగిస్తున్న మహిళలు

# కార్తీక సందడి

- కాళేశ్వరం, రామప్పకు భారీగా తరలి వచ్చిన భక్తులు
- మొదటి సోమవారం ప్రత్యేక పూజలు
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కాళేశ్వరం/వెంకటాపూర్, నవంబర్ 4 : కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా కాళేశ్వరం, రామప్ప ఆలయాల్లో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలోని గోదావరి త్రివేణి సంగమం వద్ద మహిళలు ప్రత్యేక దీపాలు వదిలి, సైకత లింగాలకు పూజలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకొని శని, కాలసర్ప దోష నివారణ పూజలు చేసి కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అలాగే శుభనందాదేవి (పార్వతి అమ్మవారు) ఆలయంలో కుంకుమార్చన చేశారు. ఆలయంలోని తులసి, మారేడు చెట్టు వద్ద లక్ష వత్తులు, కార్తీక దీపాలు వెలిగించారు. కాగా, సాయంత్రం ఆలయ అర్చకులు గోదావరి మాతకు పంచ, కుంభ హారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలు, పండ్లు, వస్త్రాలు, కుంకుమ, పసుపు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ములుగు జిల్లా రామప్పలో శ్రీరామలింగేశ్వరస్వామికి అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మామిడి, మారేడు చెట్ల వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. కాగా, స్వామి వారిని మహాకాళేశ్వరుడిగా అలంకరించారు. హనుమకొండకు చెందిన తవుటం రమాదేవి, కుటుంబ సభ్యులు స్వామికి వెండి మంగళహారతి ప్లేటు, మాణిక్యాలు బహుకరించినట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు.



వెంకటాపూర్ : రామప్ప ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు